క్లుప్తంగా

వైభవంగా శ్రీకృష్ణ పల్లకీ ఊరేగింపు

తిరుమలాయపాలెం: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ ఆధ్వర్యాన శ్రీకృష్ణ పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సత్యం, ఉపాధ్యక్షుడు ఉమేష్ చందర్, నిర్వాహకులు చెన్న సుజాత, సాయి, దీక్షిత్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీచక్ర ప్రతిష్ఠ వేడుకలు


ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం సమీపంలోని గణేష్ గార్డెన్ వద్ద గల గర్భ రక్షాంబికా సహిత గాయత్రి దేవాలయంలో ఆదివారం శ్రీచక్ర ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. 54 అంగుళాల ఎత్తుగల శ్రీచక్రాన్ని అర్చకులు ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు యామజాల శేషగిరిశర్మ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వై.శ్రీహర్ష, నాగేశ్వరరావు, ఎ.మనోరంజన్, రామారావు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారికి సత్కారం


జ్ఞాపికతో మాన్వి

ఖమ్మం అర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఖమ్మం నగరానికి చెందిన చిన్నారి మాన్వి శ్రీ మురళీకృష్ణ మందిరంలో తన కూచిపూడి నాట్యంతో పలువురిని ఆకట్టుకుంది. మమత డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు, అనితారావు దంపతుల కుమార్తె అయిన మాన్వి గురువు లక్ష్మీనారాయణ వద్ద కూచిపూడి శిక్షణ పొందుతోంది. మాన్వి ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు పలువురు మన్ననలతో పాటు సత్కరించారు.

ఆశాజనకంగా పత్తి పంట

కామేపల్లి: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి పైరు ఏపుగా పెరిగి పూత, కాత దశలో ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో పత్తికి ఎరువులు వేయడం, మందులు చల్లడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

నియామకం

నేలకొండపల్లి: కళాకారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన తెల్లగొర్ల లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొమ్ము రామ, తమ్మిశెట్టి మమత, నంద్యాల వీరభద్రం, కోయ వెంకటనారాయణ, కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా వడ్డె జగన్, బి.బొందయ్య, పి.వెంకటేశ్వర్లు, తేజావత్ శివాజీ, సహాయ కార్యదర్శులుగా షేక్ ప్రకృతి, వాసుదేవ్, తేజావాత్ భిక్షం, కార్యవర్గ సభ్యులుగా తేజావత్ బోడి, గోరంట్ల శ్రీను, మేకల వెంకటేశ్వర్లు, కె.వెంకటచారి, తుమ్మలపల్లి అచ్చయ్య, గౌరవ సలహాదారులుగా కె.అంజయ్య, సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా చిలకబత్తిని వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు లక్ష్మణాచారి, పకీరమ్మ, సీతమ్మ, రామ్‌లాల్, ఈశ్వరమ్మ, వడ్డె రామారావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రుచించని భోజనం..!


సింగారెడ్డిపాలెం పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

- మధ్యాహ్న భోజనంపై పట్టింపు కరువు
- కన్నెత్తి చూడని ఆహార కమిటీలు
- నాణ్యతపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. కానీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నారు. ప్రతీ రోజు తప్పనిసరిగా భోజనాన్ని విద్యార్థులకు వడ్డించకముందే ఉపాధ్యాయులు రుచి చూడాలనే నిబంధన అమల్లోకి తేగా.. మొదట్లో సజావుగానే సాగి నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందింది. కానీ విద్యా సంవత్సరంలో కొన్ని పాఠశాలల్లో ఈ నిబంధనలను విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యాన శుభ్రమైన వాతావరణంలో ఆహారం వండి, వడ్డించేలా అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అరకొరగా.. నాణ్యత లేనివి

పెరిగిన ధరలు భారంగా మారడంతో అరకొరగా.. నాణ్యత లేనివి తీసుకొస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయులు రుచి చూడకపోవడం వల్ల నాణ్యమైన భోజనం అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికైనా ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పరిశీలించాకే విద్యార్థులకు వడ్డించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కనిపించని ఆహార కమిటీలు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజనం విజయవంతానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఆహార కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు మధ్యాహ్న భోజన సమయానికి ముందే పాఠశాల స్థాయిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు విద్యార్థులతో కలిసి వంట పరిస్థితులను చూసి, రుచి ఎలా ఉందో పరిశీలించి భోజనం చేయాల్సి ఉంది. ఈ మేరకు ఏజెన్సీలతో పాటు కమిటీలకూ శిక్షణ ఇచ్చారు. కానీ చాలా చోట్ల ఒక్క రోజైనా పాఠశాలలను సందర్శించిన దాఖలాలు లేవు. కొన్ని చోట్ల కేవలం సంతకాలకే పరిమితమవుతుందని తెలుస్తోంది.


నేలకొండపల్లిలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ సభ్యురాలు

నిరంతర పర్యవేక్షణ..



అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆహారాన్ని తప్పకుండా పరిశీలించాలి. ఈమేరకు తనిఖీలు నిర్వహిస్తాం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించటమే లక్ష్యంగా ఏజెన్సీలు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడా అందించాం. నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– బి.చలపతిరావు, ఎంఈఓ

నిబంధనలు పాటించాల్సిందే..



మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాల్సిందే. నిబంధనల మేరకు ఉపాధ్యాయులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలి. కూరగాయలు, నిత్యావసర సరుకులు కమిటీలు పర్యవేక్షించాకే కొనుగోలు చేయాలి.

– గందు సతీష్, మాజీ సర్పంచ్, అమ్మగూడెం

మెనూ అమలు చేయాలి..



గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా అమలు చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలి. నాణ్యమైన భోజనం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– తోళ్ల సురేష్, దళిత సంఘం నాయకుడు

మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన


అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంలో ఇళ్లపై ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తొలిగించేందుకు కృషి చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం రాజేశ్వరపురం చెరువు ఆయకట్టు కింద వరదకు వరి పంటలు నీట మునిగాయి. వెంటనే నీటిని తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి గ్రామానికి చెందిన రైతులు వినతిపత్రం అందించగా.. చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే నేలకొండపల్లిలో జరిగిన మాజీ ఎంపీటీసీ చిలకల సీతారావమ్మ–రాములు కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలువురు వృద్ధులను కలిసి అవ్వా.. బాగున్నావా అంటూ పలకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, గుండ్రా బ్రహ్మం, మార్తి కోటి, కడియాల నరేష్, లక్కం ఏడుకొండలు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, కొమ్మినేని విజయ్‌బాబు, చిట్టెంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్యాయత నింపిన వేదిక


తోటి మిత్రులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన స్నేహితుడి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ వేడుకలో తన చిన్ననాటి స్నేహితులు, విద్యార్థి దశలో కలసి చదువుకున్న మిత్రులను మళ్లీ కలుసుకోవడం ఆ వేదికను మరింత ఆప్యాయతతో నింపింది.

ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందిస్తున్న మేయర్, తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 58వ డివిజన్ లబ్ధిదారులకు ఆదివారం మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, మంత్రి తనయుడు యుగంధర్‌లు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వం కల్పించిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పని చేస్తున్న లింగమ్మ భర్త కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని తెలుసుకున్న తుమ్మల యుగంధర్ ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ ముక్తార్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, నాగండ్ల దీపక్ చౌదరి, శెట్టి రంగారావు పాల్గొన్నారు.

సమాన విద్య అందించడంలో విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ సాయిబోలా

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశంలో కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమానత్వ విద్యను అందించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు పూర్తిగా విఫలమయ్యారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంపాటి పృథ్వి, అనిల్ సాయిబోలా అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధిని, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని ఆక్షేపించారు. దేశాభివృద్ధి పట్ల, పేద ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేసి విద్యార్థులందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి కొమ్ముకాస్తూ, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా రూ.8,600 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక పేద విద్యార్థులు ఆర్థిక అవస్థలు పడుతున్నార చెప్పారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థులంతా సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎర్ర అఖిల్ కుమార్, నరేందర్, సహాయ కార్యదర్శులు ఎస్.సాయికుమార్, గణేష్, సురేష్, వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, అంగిడి కుమార్, మునిగల శివ, అజయ్, నాగరాజు, గౌతం, అషూర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి కోరారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘ రాష్ట్ర మహాసభల ప్రచారం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాలతో పత్తి పంటతో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయని, వెంటనే అధికారులు పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రైతుల సమస్యలే అజెండాగా త్వరలో మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, బీరెల్లి లాజర్, బందెల వెంకయ్య, వేపాకుల శివలింగం, గోకినపల్లి లలిత, ఎస్‌కె.లాల్మియా, తిమ్మిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీ


సైకిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఆదివారం 'ఫిట్ ఇండియా'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ 11వ తెలంగాణ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ సంజయ్ భద్ర మాట్లాడుతూ.. 200 మంది ఎన్‌సీసీ కేడెట్స్ సైక్లింగ్, జంభ డ్యాన్స్, యోగా, ఫ్లాగ్ విత్ సైకిల్ కార్యక్రమాన్ని లకారం ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేజర్ సబయ్దార్, ఏఎన్ఓ లెఫ్టినెంట్ ఓంకార్, ఐ.విజయ్‌కుమార్, జె.పవన్, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని బస్టాండ్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మామిళ్లగూడెం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ బి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మామిళ్లగూడెం, బురహాన్‌పురం, బస్ డిపో రోడ్, మయూరిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

21న ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: పంచాయతీలకు నిధులు కేటాయించి, పారిశుద్ధ్యం మెరుగు పరిచి, సీజనల్ వ్యాధులను అడ్డుకునేందుకు అధికారులను అప్రమత్తం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయనున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలకు, సంఘాలకు నిధులు లేక కనీస పారిశుద్ధ్య పనులు చేపట్టపోవడంతో అనారోగ్యాలబారిన పడుతున్నారని, మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా లేక దోమల వృద్ధి తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

నివాళి..

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల వెంకటేశ్వర్లు సతీమణి గురవమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆదివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నల్లమోతు వెంకటనర్సయ్య, రవి, మురళి, వంకాయలపాటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న లబ్ధిదారుడు

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం జరిగి కొన్నేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకపోవడంతో ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఇటీవల ఖమ్మం కలెక్టర్ సమక్షంలో లబ్ధిదారులకు ఇంటి నంబర్లు కేటాయించడంతో ఇళ్ల చుట్టూ పెరిగిన ముళ్లు, పిచ్చి మొక్కలను లబ్ధిదారులే తొలగించి శుభ్రం చేసుకుంటున్నారు. త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపినట్లు లబ్ధిదారులు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

నేలకొండపల్లి: ప్రతీ పంచాయతీలలో కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని నేలకొండపల్లి సూచించారు. మండలంలోని మంగాపురంతండాలో వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన, అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ బాలాజీ, సీత్యా, గోబ్రియా, తేజావత్ కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, చిన్నంశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో గ్రామ హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యాన భూక్య సేవరీ కుటుంబానికి రూ.25 వేల విలువైన బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం సేవరీ దశదిన కార్యక్రమంలో భాగంగా సాయం అందించినట్లు యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ ఉపసర్పంచ్ మూడు శంకర్, మూడు రాజు, కిలారు వెంకటరమణ, బానోత్ రతన్‌సింగ్, బానోత్ రవికుమార్, ప్రవీణ్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య స్మారక భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం అమ్ముకుని నెలల గడుస్తున్నా.. ప్రభుత్వం నేటివరకూ బోనస్ ఇవ్వలేదని, అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి శ్రీను, మండల వ్యవసాయ సంఘం అధ్యక్షుడు తుళ్లూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బింగి రమేష్, నాయకులు నరసయ్య, మద్దినేని శ్రీనివాసరావు, కొల్లిచలం స్వామి, భూక్య రాజేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు..

శ్రావణ మాసం బోనాల పండుగలో భాగంగా ఆదివారం ముత్యాలమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రజలందరూ సుఖశాంతులు, పాడిపంటలతో తులతూగాలని అమ్మవారిని వేడుకుని బోనాలు సమర్పించారు. ఆటపాటలతో సందడి చేశారు. బంధువులు, మిత్రుల రాకతో ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా.. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: పెదతండాలో బోనంతో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి


నేలకొండపల్లిలో బోనాలతో ప్రదర్శనలు చేసుకుంటూ వస్తున్న భక్తులు


ఖమ్మం అర్బన్: బల్లేపల్లిలోని అమ్మవారి వద్ద భక్తుల పూజలు

తగ్గని వరద ఉధృతి..


కామేపల్లి: కొండాయిగూడెం పెద్దచెరువు ఆయకట్టు కింద నీట మునిగిన పంట పొలాలు

కామేపల్లి: ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి బుగ్గవాగు,నిమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కామేపల్లి, పాతలింగాల, కొండాయిగూడెం పెద్ద చెరువులోకి వరద నీరు భారీగా చేరడంతో అలుగు పోస్తుండడంతో లోతట్టు పొలాలు నీటమునిగాయి. వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్డు..

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి–మంగాపురం గ్రామాల మధ్య రహదారిలో ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నాచేపల్లి వద్ద రహదారి వరదకు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపో తీవ్ర అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


నాచేపల్లి వద్ద నిలిచిన వాహనాలు

మరీ ఇంత దారుణమా..?



వర్షపు నీరు గుంతల్లో చేరి అధ్వానంగా దర్శనమిస్తున్న పెద్దాస్పత్రి పరిసరాలు

- పెద్దాస్పత్రి పరిసరాలు మడుగుమయం
- అంతర్గత రోడ్లు కరువు
- ప్రమాదాలకు నిలయంగా గుంతలు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

ఖమ్మంవైద్యవిభాగం: పేరుకే పెద్దాస్పత్రి.. కానీ పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కనిపించేట్టుగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో నగరం నడిబొడ్డున ఉన్న ఖమ్మం ప్రభుత్వాస్పత్రి పరిసరాలు బురదమయంగా తయారయ్యాయి. అంతర్గత రోడ్లు లేకపోవడంతో గుంతలు ఏర్పడి వర్షం పడినప్పుడల్లా వాటిలోకి నీరు చేరి మడుగులా తయారవుతున్నాయి.

ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా..

పెద్దాస్పత్రిలో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా.. పాలకులు పట్టించుకోవడం లేదు. పాలకులు మారుతున్నారే తప్పా ఆస్పత్రి పరిసరాల్లో మార్పు రాక ఆస్పత్రికి వచ్చే పేషంట్లు నానా అవస్థలు పడుతున్నారు. చినుకుపడినప్పుడల్లా గుంతల్లో నీరు చేరడంతో పలువురు వాహనచోదకులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. దీనికి తోడు ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పడడంతో రెండో ఏడాది నుంచి విద్యార్థులు ఆస్పత్రిలోని రోగుల వద్ద ప్రాక్టికల్స్ నేర్చుకునేందుకు వచ్చిపోతుంటారు. ఈనేపథ్యాన పేషంట్లు, సహాయకులు, వైద్యులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఆస్పత్రి వచ్చి పోయే వారు నానా అగచాట్లు పడుతుండగా.. పరిసరాలు ఈ రకంగా ఉండడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని తక్షణం అంతర్గత రోడ్లు వేయించాలని కోరుతున్నారు.